క్లుప్తంగా

ఇంటికి మహాలక్ష్మి అమ్మాయే..



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో తల్లులను సత్కరిస్తున్న రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: అమ్మాయి పుడితే ఇంటికి మహాలక్ష్మి వచ్చినట్టేనని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవాన్ని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎక్కువ మంది ఆడపిల్లలను కనిపెంచి పోషించిన తల్లులను ఘనంగా సత్కరించి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ కుటుంబంలో ప్రేమ, ఆనందానికి మూలం కుమార్తెలు అని అన్నారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్, డాక్టర్ సువర్ణరాజు, డాక్టర్ వెంకటరమణ, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ లేబొరేటరీస్ సంఘ అధ్యక్షుడిగా వెంకట్



కాకినాడ క్రైం: జిల్లా మెడికల్ లేబొరేటరీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం స్థానిక రామారావుపేటలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బెస్ట్ లేబొరేటరీస్ అధినేత వెంకట్, కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా వైడీ ప్రసాద్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కరప: మండలంలో ఇటీవల పలువురు మృతి చెందగా, ఆ కుటుంబాలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించారు. నడకుదురులో వైఎస్సార్ సీపీ కార్యకర్త పైలా రమణ తల్లి నాగమణి, పెనుగుదురులో పితాని సత్తిబాబు మృతి చెందగా ఆయా కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. నాయకులు పైలా గోవిందు, జవ్వాది సతీష్, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



పెదకొత్తూరులో చెత్త తొలగించి, బ్లీచింగ్ జల్లుతున్న సిబ్బంది

కరప: స్వచ్ఛ గ్రామాల ఆవిష్కరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన కరప, పెదకొత్తూరు తదితర గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. పెదకొత్తూరులో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పొక్లెయినర్‌తో తొలగించి, బ్లీచింగ్ జల్లించారు. సర్పంచ్ చింతా నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి, కార్యదర్శి పి.వీరభద్రరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



కథల పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

బాలాజీచెరువు: స్థానిక గాంధీనగర్ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. సండే స్టోరీ పేరుతో జరిగిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. చందమామ కథలు, దిప్లాంట్ కింగ్డమ్, వండర్ఫుల్ స్టోరీస్ ఆఫ్‌ది వరల్డ్ తదితర పుస్తకాలు చదివారు. సుమారు 150 మంది విద్యార్థులు సందర్శించగా గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

నిరసన దీక్ష

కరప: మాజీ సీఎం చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ, జనసేన నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. మండల టీడీపీ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాలొన్నారు.

డీఎస్సీ-98 ఉపాధ్యాయుల సమావేశం

బాలాజీచెరువు: స్థానిక ఎస్‌టీయూ భవన్‌లో డీఎస్సీ-98 ద్వారా ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా నియమితులైన టీచర్స్ ఆదివారం సమావేశమయ్యారు. ఉద్యోగుల రెగ్యులర్‌తో పాటు 62 ఏళ్లకు సర్వీస్ పెంచాలని, పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కోరారు. చొల్లంగి కేశవకుమార్, కోటిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయం మనదే..

- వైఎస్సార్ సీపీ శ్రేణులు సమన్వయంతో సాగాలి
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



ఈశ్వర్‌నగర్ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



ఎమ్మెల్యే కన్నబాబును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ అర్బన్ డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి చిన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని, ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులంతా సమన్వయంతో సాగాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని అర్బన్ డివిజన్ల వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా గైగోలుపాడుకు చెందిన కడియాల చిన్నబాబు నియమితులవ్వడంతో ఎమ్మెల్యే అభినందించారు. గైగోలుపాడు నుంచి డివిజన్‌లోని మహిళలు, పార్టీ నాయకులతో కలసి రమణయ్యపేటలోని వైద్యనగర్ క్యాంపు కార్యాలయానికి ఆదివారం విచ్చేసిన చిన్నబాబు ఎమ్మెల్యే కన్నబాబును గజమాలతో సత్కరించారు. తనపై నమ్మకంతో 8 డివిజన్లకు క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ విజయం కోసం పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ రానున్న ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని, పార్టీ విజయం కోసం కలసికట్టుగా సాగుదామన్నారు. మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను, మహిళలు, సిద్ధి వినాయక సంఘం పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

రమణయ్యపేట పరిధి ఈశ్వర్‌నగర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు, మహిళలు, యువకులు పెద్దఎత్తున వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో చేరారు. పార్టీ గ్రామ నాయకుడు పాటి నాగు ఆధ్వర్యంలో ఈశ్వర్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత వినాయకుడి ప్రతిమను కన్నబాబు దర్శించుకున్నారు. అనంతరం సుమారు వంద మందికి ఎమ్మెల్యే కన్నబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సోమాదుల ఈశ్వరరావు, కొప్పిశెట్టి పవన్‌కుమార్, అప్పికొండ ప్రకాశరావు, పెరుపూడి దుర్గబాబు, కాకి అప్పన్న, ఓదూరి శ్రీనివాసరావు, పెరుపూడి శివసత్యం తదితరులు ఉన్నారు. అనంతరం స్థానిక సమస్యలు తెలుసుకున్న కన్నబాబు మాట్లాడుతూ ఈశ్వర్‌నగర్ ప్రవేశ మార్గం వద్ద ఎప్పటి నుంచో ఉన్న కల్వర్టు సమస్య పరిష్కరించామన్నారు. రోడ్డు విస్తరణ కోసం అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు పక్కకు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీల సమస్యల పరిష్కారంతో పాటు తాగునీటి సమస్య లేకుండా కుళాయి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. సచివాలయం సమీపంలో ఎప్పటి నుంచో నివాసాలు ఉంటున్న వారికి పక్కాగా పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మలుపు వద్ద అడ్డుగా ఉన్న రెండు మూడు, ఇళ్లు తొలగించాల్సి వస్తే వారికి సమీపంలోనే ప్రత్యామ్నాయం చూపుతామన్నారు. కొందరు మహిళలు తమ నివాసాలకు పట్టాలు ఇవ్వాలని కోరడంతో తహసీల్దార్‌తో అక్కడ నుంచే ఫోన్‌లో మాట్లాడి సర్వే చేయించి పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళల అభ్యర్థన మేరకు దసరా కానుకగా అక్టోబర్ 15లోగా పొజిషన్ సర్టిఫికెట్లను అందిస్తామని కన్నబాబు హామీ ఇచ్చారు. యువకుల కోరిక మేరకు వినాయక గుడి నిర్మిస్తామని అన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి, రమణయ్యపేట పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, జంగా గగారిన్, సేవాదళ్ మండల అధ్యక్షుడు మోకా కృష్ణంరాజు, రామిరెడ్డి, ధర్మారావు, నన్నయ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాజ్‌కుమార్, రిటైర్డ్ ఎంపీడీఓ విశ్వనాథరెడ్డి, శర్మ పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందన



సూపరింటెండెంట్ లావణ్యకుమారిని అభినందిస్తున్న డాక్టర్ రామకృష్ణ

కాకినాడ క్రైం: స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుడు, ట్రస్ట్ ఆసుపత్రి డైరెక్టర్, రోటరీ బ్లడ్ బ్యాంకు చైర్మన్ డాక్టర్ ఎస్‌సీహెచ్ రామకృష్ణ శనివారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిని ఆమె ఛాంబర్‌లో కలిశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించడంతో ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ కీలక బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. జీజీహెచ్ ఎందరో పేద రోగుల పాలిట సంజీవని అని చెబుతూ వైద్య ఆరోగ్య ప్రమాణాలు మరింత వృద్ధి చేయాలని కోరారు. ఆసుపత్రి అభివృద్ధితో పాటు నాణ్యమైన సేవలు అందించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ సేవల వృద్ధికి ట్రస్ట్ ఆసుపత్రి నుంచి సహకరిస్తామని డాక్టర్ రామకృష్ణ తెలిపారు.

ఏపీజీఎన్ఏ ఎన్నికలకు సన్నాహాలు



ఏపీజీఎన్ఏ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన నర్సులు

కాకినాడ క్రైం: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ (ఏపీజీఎన్ఏ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికలకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లోని కమ్యూనిటీ హాల్లో కార్యవర్గ సమావేశం జరిగింది. స్టాఫ్‌నర్సు ఎస్.శ్యామల విజయకుమారి, హెడ్ నర్సు మేరీ సుజాత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతి నర్సు ఓటు నమోదు చేయించుకోవాలని తీర్మానించారు. అందుకు ఏడాదికి రూ.240 చొప్పున మూడేళ్లకు గాను రూ.720 మొత్తం చెల్లించి సంఘంలో ఓటు హక్కు పొందాలని సూచించారు. ఈ నెల 30వ తేదీకి ప్రతి నర్సు తమ ఓటు నమోదు చేయించుకుని రసీదు పొందాలన్నారు. నమోదు చేయించుకున్న ఓటర్ల గణాంకాలు రుసుములతో సహా రాష్ట్ర ఎన్నికల అధికారులకు సమర్పిస్తే జిల్లా ఎన్నికల అధికారి నియామకం జరుగుతుందన్నారు. ఏపీజీఎన్ఏ రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కర్నూలు నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, గుంటూరు నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ ఆర్.పద్మావతిలను ఎన్నికల అధికారులుగా నియమించిందని శ్యామల తెలిపారు. మూడేళ్ల అనంతరం ప్రతిష్టాత్మకంగా జరుగనున్న ఎన్నికల కోసం అసోసియేషన్ సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

భజే గణనాథా..

భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్ర పూజలు



కరప మెరకవీధి హంసగుడి వద్ద హోమం చేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, సత్తిబాబు దంపతులు



పేర్రాజుపేట కరసూదివారి వీధిలో సామూహిక సరస్వతీ పూజల్లో విద్యార్థులు

కరప: నియోజకవర్గంలో గణపతి నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వీధివీధినా మండపాల్లో వినాయక విగ్రహాలను నిలిపి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కరప మెరకవీధి హంసగుడి వద్ద శ్రీలక్ష్మీ గణపతి బృందం వినాయక విగ్రహాన్ని నిలపగా ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు దంపతులు పూజాదికాలు చేస్తున్నారు. ఆదివారం వేద పండితుడు సాయిమణికంఠ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సతీమణి శ్రీవిద్య, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు తదితరులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పెంకే మంగరాజు, బొంతు నాగు, రాయుడు లక్ష్మణరావు, పెంకే వెంకటరమణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బోట్‌క్లబ్: స్థానిక పేర్రాజుపేట కరుసూదువారి వీధిలో వినాయక మంటపంలో శ్రీబాలగణేశ్ యూత్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజలు చేశారు. విద్యార్థులకు ఉచితంగా పూజా సామాగ్రిని సమకూర్చి పూజలు చేయించారు. సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో విద్యార్థులతో సరస్వతీ పూజలు నిర్వహించారు. ఆర్టీసీ కాలనీలో ఐదు గుళ్లలో వినాయక గుడి వద్ద ఏర్పాటు చేసిన చవితి ఉత్సవాలలో భాగంగా విద్యార్థులతో సరస్వతి పూజ చేయించామని ఆలయ కమిటీ చైర్మన్ ఇంటి నందిబాబు తెలిపారు. పుస్తకాలు, పెన్నులు ఉచితంగా అందజేశామని అన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు సర్వే



నడకుదురులో ఆరోగ్య సురక్ష సర్వే కరపత్రం అందజేస్తున్న రత్నకుమార్, శ్రీనివాస్ నాయక్

కరప: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కె.రత్నకుమార్ తెలిపారు. వైద్య, ఆశా సిబ్బంది సర్వేకు వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలన్నారు. ఆదివారం ఆయన మండల వైద్యాధికారి శ్రీనివాస్ నాయక్‌తో కలసి నడకుదురులో నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొని, పలు సూచనలు చేశారు. సర్వే చేసేటప్పుడు ఇంట్లో ప్రతి ఒక్కరికీ బీపీ, హెచ్‌బీ, షుగర్ పరీక్షలు చేయాలన్నారు. ఈ నెల 30 నుంచి గైనకాలజిస్ట్, ఎముకల వ్యాధి నిపుణులు, పిల్లల వైద్యులు, జనరల్ వైద్యులతో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశయం మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఐఓ కోరారు.

ఆ ఆలోచన వెనక్కి తీసుకోవాలి

కాకినాడ సిటీ: సముద్ర తీరంపై హక్కును కోల్పోయే విధంగా ఉన్న బ్లూ ఎకనమీ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని జాతీయ మత్స్యకార కార్మిక సంఘం (ఏఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్) విస్తృత సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక యూటీఎఫ్ హోంలో సంఘ నాయకురాలు రమణి అధ్యక్షతన ఆదివారం జాతీయ వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు మత్స్యకారుల జీవన భృతిని దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. సముద్ర గర్భంలో సంపదను కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టడానికి కేంద్రం తీసుకుంటున్న ఈ నిర్ణయం దుర్మార్గమన్నారు. దీనిపై నవంబర్ 3, 4, 5 తేదీల్లో కాకినాడలో జరిగే జాతీయ మత్స్యకార సంఘం సమావేశం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మత్స్యకార కార్మిక సంఘ నాయకులు బొడ్డు సత్యనారాయణ, డాక్టర్ చెక్కా సింహాచలం, కొల్లాటి శ్రీనివాసరావు, జల్లి రామ్మోహన్, సీహెచ్ తాతారావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో స్టాల్స్ తనిఖీ

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ ఆహార్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్లాట్‌ఫారాలపై ఉన్న స్టాల్స్, ఐఆర్‌టీసీ ఫుడ్ స్టాల్స్‌ను అధికారులు తనిఖీ చేశారు. స్వచ్ఛ భారత్ పక్షోత్సవాల్లో భాగంగా నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించే విధంగా స్టేషన్ మేనేజర్ రమేష్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిశోర్ పర్యవేక్షణలో ఈ తనిఖీలు జరిగాయి. స్టాల్స్‌లో ప్రతి వస్తువు విక్రయాలకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేసే విధంగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. స్టాల్స్‌లో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా యూనిఫారంతో పాటు ఐడీ కార్డులను కలిగి ఉండాలన్నారు. లేకుంటే అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు.

ఎన్ఎస్ఎస్‌లో భాగస్వాములు కావాలి



ఆదిత్య డిగ్రీ కళాశాల ఏడీ డాక్టర్ నాయుడిని సత్కరిస్తున్న మానికిరెడ్డి సత్యనారాయణ, పీవో తేజేశ్వరరావు

బాలాజీచెరువు: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని మానికిరెడ్డి హెల్త్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రాధాన్యాన్ని వివరించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ కళాశాల ఆధ్వర్యంలో సమీప దత్తత గ్రామాలను తీసుకుని అక్కడి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. అనంతరం ఏడీ నాయుడిని సత్కరించారు. ఎన్ఎస్ఎస్ పీవో తేజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు. స్థానిక జేఎన్‌టీయూకేలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కోఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ మీరా సాహెబ్, ప్రోగ్రాం ఆఫీసర్లు రమణాజీ, కిరణ్మయి, వీరలక్ష్మి పాల్గొన్నారు.

అపవిత్ర ప్రదేశాల్లో గణేశ నిమజ్జనాలా!



వినాయక సాగర్ వద్ద నిరసన తెలుపుతున్న దూసర్లపూడి రమణరాజు

బోట్‌క్లబ్: నగరంలోని అపవిత్ర ప్రదేశాల్లో గణేశ విగ్రహాల నిమజ్జనాలు చేయడం సరికాదని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. స్థానిక వినాయక సాగర్ వద్ద పిండ ప్రదానాలు చేసేచోట నిమజ్జనమా అంటూ ఫ్లెక్సీతో ఆయన నిరసన చేపట్టారు. బ్రహ్మంగారి మఠం వద్ద గణేశ విగ్రహాలు, పూజా పత్రి కలపడం అమంగళకరమన్నారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ జెట్టీ వద్ద సినిమా రోడ్డు డ్రైనేజీ నుంచి వచ్చే మల మూత్ర వ్యర్థాలు కలిసే చోట గణేశ నిమజ్జనం ఏర్పాటు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. జగన్నాథపురంలోని రెండు వంతెనల మధ్య ఉన్న వినాయకసాగర్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రవేశం లేకుండా చేయడంతో వంతెనపై నుంచి ఉప్పుటేరులోకి విగ్రహాలు విసిరి నిమజ్జనం చేసే దుస్థితి కల్పిస్తున్న అధికారులు తీరు అత్యంత విచారకరమన్నారు. గణేశ సాగర్ వద్ద నిమజ్జనానికి అనుమతించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి శిక్షణ దోహదం



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ

సామర్లకోట: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. కాకినాడ జిల్లాలోని గ్రేడ్-1, 5 కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నిర్వహించిన రెసిడెన్షియల్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. గ్రామాల్లో కొత్తగా లేఅవుట్ల ఏర్పాటుపై అమలులో ఉన్న నిబంధనలను పంచాయతీ కార్యదర్శులు పూర్తి స్థాయిలో తెలుసుకోవాలన్నారు. కొత్త లేఅవుట్ల ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉద్యోగుల విధి నిర్వహణకు సంబంధించి క్రమశిక్షణ చర్యలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆరు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులు నేర్చుకున్న అంశాలపై రాత పరీక్ష నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించారు. జిల్లా నుంచి వంద మంది పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. అనంతరం కార్యదర్శులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సోమవారం నుంచి నాల్గో బ్యాచ్ పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ప్రారంభం అవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆ బ్యాచ్‌తో కాకినాడ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ముగుస్తుందన్నారు. ఫ్యాకల్టీలు శ్రీదేవి, బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



పాత ఇసుకపల్లిలో కమ్యూనిటీ హాలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ తులసీకుమార్

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లిలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టే కమ్యూనిటీ భవన అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల పాలనలో సంక్షేమం కనుచూపు మేరలో లేదన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో పేదలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏజెంట్ల ధర్నా విజయవంతానికి పిలుపు



ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

పెద్దాపురం: ఎల్ఐసీ పరిరక్షణ, ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 9న హైదరాబాద్‌లో జరిగే చలో జోనల్ కార్యాలయం ఏజెంట్ల ధర్నాను జయప్రదం చేయాలని ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ జనరల్ సెక్రటరీ పీఎల్ నరసింహారావు పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం నిర్వహించిన రాజమండ్రి డివిజన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివిజన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో ఎల్ఐసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తొలుత భీమవరం బ్రాంచ్‌కు చెందిన పీఆర్‌కే రాజును రాజమండ్రి కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఏజెంట్లు టి.కోటేశ్వరరావు, రవిశంకర్, నాగిరెడ్డి, బి.వీరభద్రరరావు, కేఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

వెళ్లే దారులు.. పొదల వెతలు



కాకినాడ- రావులపాలెం ప్రధాన రహదారిలో రోడ్డు మార్జిన్‌లో పెరిగిన మొక్కలు



వలసపాకల సమీపంలో రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు

కరప: ఆ రోడ్లలో ప్రయాణం భయం భయమే.. మండలంలో పలు రహదారుల వెంబడి పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోవడమే అందుకు కారణం. కాకినాడ- రావులపాలెం ప్రధాన రహదారి నడకుదురు, పెనుగుదురు, కరప, వలసపాకల, వేములవాడ, పెదకొత్తూరు, వేళంగి గ్రామాల మీదుగా సాగుతోంది. కరప నుంచి అరట్లకట్ట వెళ్లే రోడ్డు, వేములవాడ నుంచి గొర్రిపూడి వెళ్లే ఏటిగట్టు రోడ్డు, వేళంగి నుంచి వెళ్లే కాపవరం రోడ్డు, యండమూరు నుంచి వెళ్లే జి.భావారం రోడ్డు, నడకుదురు నుంచి యానాం రోడ్డుకు వెళ్లే గురజనాపల్లి రోడ్డు మండల పరిధిలో ఉంటాయి. ఆయా గ్రామాల మధ్యలో ఈ రహదారుల పొడవునా రోడ్డు అంచుల వెంబడి పిచ్చిమొక్కలు, పెంటకుప్పలు నిండిపోయాయి. రహదారులన్నీ ముళ్ల పొదలతో భయంకరంగా మారాయి. వీటికితోడు గ్రామాల వద్ద చెత్త రోడ్డు మార్జిన్లలో వేయడంతో పక్కకు వెళ్లేందుకు జాగా లేకుండా పోయింది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనచోదకులు అవస్థల పాలవుతున్నారు. పాదచారులకూ ఇబ్బందికరంగా ఉంటోంది. రోడ్డు మార్జిన్లలో తుప్పలు, పిచ్చిమొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని వేములవాడ, పెదకొత్తూరు సర్పంచులు కమిడి మంగాదేవి, చింతా నాగలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

గాయాల పాలవుతున్నారు



రోడ్డు మార్జిన్లలో ముళ్ల పొదలు, తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎదురుగా వచ్చే బస్సులు, లారీలు తప్పించుకునేందుకు రోడ్డు పక్కకు వెళితే మార్జిన్లలో పెరిగిపోయిన ముళ్లపొదలు గీరుకుపోయి గాయాలవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన వీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

–రొక్కాల గణేష్, సర్పంచ్, జి.భావారం

చర్యలు తీసుకోవాలి



ముళ్లపొదలు, పిచ్చిమొక్కల కారణంగా రోడ్లపై ప్రయాణం చేయాలంటే భయమేస్తోంది. అటుగా వెళ్లాలంటేనే అందరూ జంకుతున్నాం. అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకంలో ఈ ముళ్ల పొదలు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

–అప్పనపల్లి పెద్ద, వేములవాడ